క్లుప్తంగా...

గోల్కొండ ఆస్పత్రిలో నేడు ఇఫ్తార్ విందు

గోల్కొండ: నేడు గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా దావత్‌-ఏ-ఇఫ్తార్ నిర్వహిస్తున్నామని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే ఇఫ్తార్‌లో తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయకుమార్, గోల్కొండ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

కార్పొరేటర్ పర్యటన

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని అరవింద్‌నగర్, సమతా కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమతా కాలనీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల విషయంపై ఎవ్వరూ కూడా తనవద్దకు రానవసరం లేదని, తాను ప్రతివారం ఇంటింటికీ మజ్లిస్ కార్యక్రమం నిర్వహిస్తూ అన్ని బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకుని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు ముజీబ్, ఎండి సుల్తాన్ తదితరులున్నారు.

ప్రాచీన ఆలయానికి వీడిన గ్రహణం



ఆలయ ఆవరణలో మట్టిని తొలగిస్తున్న జేసీబీ

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా నవాబు సాహెబ్ కుంటలో ఉన్న ప్రాచీనమైన ఆలయానికి ఎట్టకేలకు గ్రహణం వీడింది. దాదాపు 400 ఏళ్ల నాటి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయం దూప దీప నైవేద్యాలకు నోచుకోకుండా చెత్త కుప్పల్లో పేరుకుపోయింది. ఈ విషయాన్ని బీజేపీ నాయకులు విశ్వనాథ్, ఆశీష్‌రాజ్ పలుమార్లు దేవాదాయ శాఖ అధికారులతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారుల సహకారంతో ఆలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జేసీబీలతో తొలగించారు. 650 గజాల విస్తీర్ణంలో ఈ ఆలయం ఉన్నట్లు దేవాదాయ రికార్డ్‌లో ఉన్నాయి.

మే 8న చిత్రకళా ప్రదర్శన



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మే 8న పికాసో స్కూల్ ఆఫ్ ఆర్ట్ విద్యార్థులచే మాతృదేవోభవ పేరిట చిత్రకళా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ భైరు రమేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రవీంద్రభారతిలో చిత్రకళా ప్రదర్శన వాల్‌పోస్టర్‌ను భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు మాతృమూర్తిపై గీసిన ఎన్నో అద్భుతమైన చిత్రాలను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇఫ్తార్ విందును వాయిదా వేయాలని వినతి



హోంమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: సీఎం కేసీఆర్ ఈనెల 12న ఇవ్వనున్న ఇఫ్తార్ విందును వాయిదా వేయాలని ఇప్పటికే హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీని కలిసి వినతిపత్రం అందజేశామని బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ.. ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేనందున సీఎం ఇఫ్తార్ విందును ముస్లింలందరూ బహిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు.

పూలే జీవితం.. ఆదర్శనీయం

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక అసమానతలను రూపుమాపేందుకు తుది శ్వాస వరకు జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



ఎంజీబీఎస్‌లో నివాళులర్పిస్తున్న ఈడీ పురుషోత్తమ్ నాయక్ తదితరులు



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆచార్య ఉమామహేశ్వర్



నివాళులర్పిస్తున్న టీఎన్జీఓస్ అధ్యక్షుడు ఎస్‌.ఎం.ముజీబ్ హుస్సేని



కట్టెలమండిలో.. గోపాల్‌జీ, ప్రకాష్‌రెడ్డి, ఉమాశంకర్ తదితరులు



జ్యోతిరావు పూలే జయంతి కన్వీనర్ ముఖేష్ ముదిరాజ్‌ను సత్కరిస్తున్న దృశ్యం



చుడిబజార్‌లో.. బీఆర్‌ఎస్ నాయకులు పప్పుమాత్రే, సుమన్‌కుమార్, జనార్దన్ తదితరులు



గన్‌ఫౌండ్రీలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో..



చాంద్రాయణగుట్టలో.. ఆకుల శ్రీనివాస్ తదితరులు



నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు జీవన్‌సింగ్, దేవర శ్రీనివాస్



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు కృష్ణ తదితరులు



జియాగూడ నవోదయనగర్‌లో.. బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్, దర్పల్లి నర్సిములు, జగదీష్ యాదవ్



జియాగూడ బీఆర్‌ఎస్ కార్యాలయంలో.. జీవన్‌సింగ్, అధ్యక్షుడు నరహరిచారి



ఛత్రినాకలో..

మహేష్‌గౌడ్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ భోజ్యా నాయక్ తదితరులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా మహంకాళి అమ్మవారికి మహేష్‌గౌడ్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ భోజ్యానాయక్ అన్నారు. లాల్‌దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయ కమిటీ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ గాని మహేష్‌గౌడ్ 73వ జయంతి సందర్భంగా ఆలయ ఆవరణలో శ్రీ మహంకాళి మహేష్‌గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ భోజ్యానాయక్ ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. బోనాల పండగను జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌గౌడ్, అధ్యక్షుడు అరవింద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సభ్యులు సురేష్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు కాశీనాథ్ గౌడ్, విష్ణుగౌడ్, బల్వంత్‌యాదవ్, రాజ్‌కుమార్ యాదవ్, మాణిక్ ప్రభుగౌడ్ పాల్గొన్నారు.

‘విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి’



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

చార్మినార్: ఏబీవీపీ కోఠి జిల్లా, చార్మినార్ సిటీ కళాశాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత, అవినీతి, విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని హైకోర్టు చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ సబావట్ కళ్యాణ్, కళాశాల అధ్యక్షులు దిలీప్ మాట్లాడుతూ.. 18 లక్షల మంది విద్యార్థుల ఎదురు చూపులు అయిన 500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే ప్రభుత్వం విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సజన్‌తో పాటు రాహుల్, శ్రీకాంత్, యశ్వంత్, రమేష్, సందీప్, తరుణ్, అరవింద్, రుసేంద్ర, కార్తీక్, లక్ష్మణ్, అమరేందర్, భావ్య, అనిత, శ్రావణి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

నాంపల్లి: అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి నవనీతరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు మంగళవారం బీఆర్కే భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వేతన సమవరణ సంఘం–2023 నియమించాలని, ప్రతినెల పెన్షనర్లకు ఒకటవ తేదీనే చెల్లించాలని, బకాయిపడ్డ మూడు డీఆర్‌లు వెంటనే చెల్లించాలని, గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల పెన్షన్ 010 పద్దు కింద చెల్లించాలని, అంత్యక్రియల ఖర్చు రూ.30వేలు ఇవ్వాలని, వైద్య ఖర్చుల బిల్లులు విడుదల చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాములు, రాష్ట్ర నేతలు ప్రేమ్‌కుమార్, ఫీయుద్దీన్, శ్రవణ్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎంఎన్‌జే ఆస్పత్రికి చేయూత

సాక్షి, సిటీబ్యూరో: కేన్సర్ చికిత్సలకు పేరొందిన ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌కు ఆర్థిక సేవల సంస్థ సింక్రొనీ చేయూతని అందించింది. 7 దశాబ్దాలకు పైబడి నిరుపేద కేన్సర్ రోగులకు ప్రశంసనీయమైన సేవలు అందిస్తున్న ఈ ప్రభుత్వాస్పత్రికి తమ వంతు మద్దతుగా 23 పడకల ఐసీయూ బెడ్‌ను నిర్మించడంలో సహాయపడటంతో పాటుగా ఒక ఎక్స్ రే యూనిట్‌ను సైతం అందుబాటులోకి తీసుకువచ్చామని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు తెలిపారు. అంతేకాకుండా రోగుల తరలింపు కోసం 14 పేషంట్ ట్రాలీలను అందించామన్నారు. వీటి ద్వారా కనీసం 100కు పైగా రోగులకు సేవలు అందించవచ్చునన్నారు. ఈ హాస్పిటల్‌కు తగిన మద్దతు అందించడాన్ని తాము గౌరవంగా భావిస్తున్నామని ఈ కార్యక్రమంలో భాగం పంచుకున్న యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సీఈఓ రేఖా శ్రీనివాసన్ అన్నారు.

గౌలిపురాలో ‘బీజేపీ పల్లె పల్లె ఓబీసీ’



కార్యక్రమంలో కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి, జితేంద్ర, రూప్‌రాజ్ తదితరులు

గౌలిపురా: రాష్ట్ర బీజేపీ ఓబీసీ పిలుపు మేరకు మంగళవారం గౌలిపురా డివిజన్‌లో పలు ప్రాంతాల్లో రాష్ట్ర అధికార ప్రతినిధి మోకాళ్ల వెంకటేష్, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కందడి ప్రేమ్‌కుమార్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ పల్లె పల్లె ఓబీసీ ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి తిరుగుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ బీసీలపై చేస్తున్న మోసాలు, అన్యాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి, భాగ్యనగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రూప్‌రాజ్, మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు రాజేశ్, యాకుత్‌పురా కన్వీనర్ ధీరజ్, సుమన్‌కుమార్ ముదిరాజ్, డొంకి యాదగిరి, అశోక్, భాను ప్రకాశ్, రఘుకాంత్, మధు, నళిని గౌడ్, సుశీల్ పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే 150 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



రామకృష్ణను సన్మానిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ నగరంలో మహాత్మా జ్యోతిరావు పూలే 150 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం రవీంద్రభారతిలో మహాత్మా జ్యోతిబా పూలే 197వ జయంతిని పురస్కరించుకుని బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. అంబేడ్కర్ గురువుగా భావించే జ్యోతిబాపూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని, బీసీలకు బీసీ ఆడిటోరియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పలు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోళ జనార్దన్

సుల్తాన్‌బజార్: డాక్టర్ కందాల శోభారాణి ఆశయ సాధనకు కృషి చేయాలని టీఎస్‌జేఏసీ చైర్మన్ కోళ జనార్దన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పీడిత ప్రజల గొంతుక యూకే. అధ్యాపకురాలు డాక్టర్ కందాల శోభారాణి యాది సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆదివాసి హక్కుల కోసం మహిళ అణిచివేతపై ఉద్యమాలు చేశారన్నారు. ఈనెల 15న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు కందాల శోభారాణి యాది సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాం, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ వైఎస్ అధ్యక్షులు బండి కిరణ్, రైల్వే జేఏసీ చైర్మన్ ముత్తన్న, రాజేంద్రప్రసాద్, బీఎస్‌.చారి, టీపీఎఫ్ రాంబాబు, సత్యనారాయణ, సాయికిరణ్, సూరజ్ పాల్గొన్నారు.

‘కలిసికట్టుగా బీజేపీని ఓడిస్తాం’



సంఘీభావం ప్రకటించిన నందకిశోర్‌వ్యాస్ బిలాల్, మంగళ్‌హాట్ డివిజన్ నాయకులు

అబిడ్స్: కార్యకర్తలు, నాయకులు ఎలాంటి విభేదాలు లేకుండా కలిసికట్టుగా ఉండి బీజేపీని చిత్తుగా ఓడించేందుకు కృషి చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గోషామహల్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళ్‌హాట్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీసింగ్, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌సింగ్ మాట్లాడుతూ.. తామంతా ఐక్యంగా ఉండి బీజేపీని రాబోయే ఎన్నికల్లో నామరూపం లేకుండా చేస్తామన్నారు. 13న ఆత్మీయ సమ్మేళనం పెద్ద ఎత్తున చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శశిరాజ్ సింగ్, చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌సింగ్ జమేదార్, మనోహర్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ, కార్పొరేటర్ వసీయుద్దీన్

యాకుత్‌పురా: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. చార్మినార్ మండల పరిధిలోని షాదీ ముబారక్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను మంగళవారం యాకుత్‌పురా ఆల్ ఉస్నా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్లపై అవగాహన కల్పించి వాటిని ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న పేదలు స్వయం ఉపాధి పథకాలు, ప్రభుత్వం అందించేందుకు రుణాలను బ్యాంక్‌ల ద్వారా పొంది వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్, చార్మినార్ తహసీల్దార్ మల్లేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఆసిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గోవుల పరిరక్షణకు మే 24 నుంచి జీసీసీఐ ఎగ్జిబిషన్



కరప్రతాలను ప్రదర్శిస్తున్న అమితాబ్ భట్నాగర్, జస్మత్ పటేల్ తదితరులు

సుల్తాన్‌బజార్: గోవుల పరిరక్షణకు కన్ఫడరేషన్ ఆఫ్ కౌ బెస్ట్ ఇండస్ట్రీస్ (జీసీసీఐ) ఆధ్వర్యంలో మే 24 నుంచి 28 వరకు గుజరాత్‌లోని రాజ్‌కోర్ట్ రేస్ కోర్ట్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు జీసీసీఐ గౌరవ కార్యదర్శి అమితా భట్నాగర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంస్థ ప్రతినిధులు జస్మత్ పటేల్, జగ్రాజ్ శ్రీమాల్, రితేష్ జాగిర్దార్ మాట్లాడారు. ఈ ఎగ్జిబిషన్‌కు ముఖ్యఅతిథులుగా పాడిపరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి పర్షోత్తం రూపాలా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పాటేల్, ఆ రాష్ట్ర గవర్నర్ త్రివేది హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 300లకు పైగా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈనెల 15న లక్డీకాపూల్‌లోని ప్యాప్సీ భవన్‌లో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెపారు. అలాగే గోవుల వల్ల వచ్చే పాలు, పేడ, గో మూత్రం, నెయ్యి, ఇతరాత్ర అంశాలతో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి, గోవుల పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఆవు ఆధారిత ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి ఇలాంటి బహుళ కొత్త పరిశ్రమలకు ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో మురళీ మనోహర్‌జీ, రంజానాబేన్‌షా, పరమేశ్వరీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

‘ఇఫ్తార్ విందులకు హైదరాబాద్ పెట్టింది పేరు’



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కౌసర్, పాషాభాయ్

గోల్కొండ: హైదరాబాద్ నగరం మతసామరస్యానికి పెట్టింది పేరు అని, ఇఫ్తార్ విందులకు మన నగరం మారుపేరుగా నిలిచిందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం గోల్కొండ జీఎంకే బిల్డర్స్ అండ్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ గులాం మొయినుద్దీన్ ఖాన్ పాషాభాయ్ ఆధ్వర్యంలో గోల్కొండ మోతీ దర్వాజ వద్ద జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం అంటే ఇఫ్తార్ విందులేనన్న అభిప్రాయం ప్రజలలో నెలకొని ఉందని ఆయన అన్నారు. ఇఫ్తార్ విందుల్లో తమ స్నేహితులు, బంధువులనే కాకుండా స్థానిక పేదలను కూడా ఆహ్వానించాలని, దీనివల్ల పేద, ధనిక వర్గాల మధ్య ఉన్న భావం తొలగిపోతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీఎంకే బిల్డర్స్ అండ్ డెవలపర్స్ డైరెక్టర్ షకీల్ అలీఖాన్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు బదర్ ఉద్దీన్, వజీ ఉజ్‌జమా, హారూన్ ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు మొక్క అందజేత



అబిడ్స్: మంత్రి కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ కలిశారు. మంగళవారం మంత్రిని ఆశీష్‌కుమార్‌యాదవ్ కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్ యాదవ్‌కు మంత్రి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

ముగిసిన ‘పది’ పరీక్షలు



గోల్కొండ: పదవ తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. గోల్కొండ జోన్ పరిధిలోని 53 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ఈ పరీక్షలు ముగిశాయి. పరీక్షలు ముగిసిన సందర్భంగా పలు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు సందడి చేశారు.

రైలులో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: రైలులో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం నాంపల్లి జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోరబండ–హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 50 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తుతెలియని వ్యక్తి బోరబండ–హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో, గుర్తుతెలియని రైలులో ప్రయాణిస్తూ జారి కిందపడ్డాడు. అతడి తలకు బలమైన గాయలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవ పంచనామ నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.